క్లుప్తంగా

ఆయకట్టుకు నీరిచ్చి రైతులను ఆదుకోండి



రెడ్డి శేఖర్‌రెడ్డికి సాగునీటి సమస్యలను విన్నవిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు నీరిచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ రెడ్డిశేఖర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం నియోజకవర్గ రైతులతో జలమండలిలో ఆయనను కలిసి విన్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. గాజుల దిన్నె ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువ, తుంగభద్ర నది తీరంలో ఉన్నటువంటి ఎత్తిపోతల పథకాల కింద సాగు చేసిన ఆయకట్టుకంతా నీరు ఇవ్వాలన్నారు. ఇంకా పంటలు చేతికి రాలేదని, ప్రస్తుతం నీరు తగినంత రాకపోవడంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన రైతులు ఎక్కువ శాతం క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం సాగునీటిపై ఆధారపడి ఉన్నారని, వారికి నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. స్పందించిన పర్యవేక్షక ఇంజినీర్ ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట గూడూరు జెడ్పీటీసీ మౌలాలి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పోలకల్ ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు నరసింహారెడ్డి, నాగేష్, పోలకల్ తదితరులు ఉన్నారు.

తిమ్మగురుడు ఉత్సవాలు ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని మీటే తండా సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన తిమ్మ గురుడు, పక్కీరప్పస్వాముల తిరునాల ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలతో రాత్రంతా జాగరణ చేశారు. తిరునాల సందర్భంగా అప్పా సోదరులు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో మిఠాయి, జాయింట్‌వీల్, బొమ్మలు, గాజుల అంగళ్లు, హోటళ్లు తదితర దుకాణాలు వెలిశాయి. స్వాముల ఉత్సవ విగ్రహాలను సాయంత్రం మేళ తాళాలతో ఉప్పర్లపల్లి నుంచి బోడబండకు చేర్చారు. ఆదివారం సాయంత్రం రథోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు సుదర్శనరెడ్డి, అప్పా వేణు, నిర్వాహకులు ఉప్పర్లపల్లి సర్పంచ్ ప్రభాకరరెడ్డి, కృష్ణయ్యఆచారి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వాల్తేరు వీరయ్య, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, శ్రీదేవి శోభన్‌బాబు
మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, శ్రీదేవి శోభన్‌బాబు, ఊ అంటావా మావా ఊఊ అంటావా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్
భరత్ కాంప్లెక్స్ : పఠాన్, మేఖేల్, షెహ్జాదా
రాజ్ : వినరో భాగ్యము విష్ణు కథ
శ్రీరామ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా
విజయ: సార్



భక్తులకు అల్పాహార ప్రసాదాన్ని వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కైలాసగిరి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో మల్లికార్జునుడు



కైలాసగిరి ఆలయంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



లలితా పీఠంలో భజనలు చేస్తున్న భక్తులు

సర్వేశ్వరాయ.. సదాశివాయ

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర పరిధిలో ఉన్న శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వరాలయం, సప్తగిరినగర్ కైలాసగిరి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వరాలయం, లలితా పీఠం, నెహ్రూనగర్‌లోని సాయీశ్వరాలయం, అశోక్‌నగర్, శ్రీరామనగర్, బుధవారపేటల్లోని శివాలయాలు, సూర్యనారాయణ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేలాది మంది భక్తులు ఉపవాసం ఉండి స్వామివారిని దర్శించుకొని జాగారం చేశారు. అభిషేక ప్రియుడైన భోళా శంకరునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించడంతో శైవక్షేత్రాలన్నీ ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. విశ్వేశ్వరాయ మహాదేవాయ.... సర్వేశ్వరాయ సదా శివాయ అని భక్తులు స్వామిని స్మరిస్తూ జాగరణ చేసి లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవ వేడుకలను వీక్షించారు. ఆది దంపతులైన శివపార్వతులను దర్శించుకొని తరించారు. లింగాష్టకం, శివ పంచాక్షరి జపించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవదాయశాఖ అధికారులు, ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకారంలో రూపాల సంగమేశ్వరుడు

కనుల పండువగా ప్రభోత్సవం

కర్నూలు నగరం జగన్నాథ గట్టులోని శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని తరించారు. దిన్నెదేవరపాడు గ్రామస్తులచే నిర్వహించిన ప్రభోత్సవం కనుల పండువగా సాగింది. లింగోద్భవ అభిషేకం, శివపార్వతుల కల్యాణం, స్వామివారి ప్రాకార పల్లకి సేవ కార్యక్రమాలు శోభాయమానంగా జరిగాయి. దిన్నెదేవరపాడు గ్రామ పెద్ద పెరుగు సీతా రామిరెడ్డి కుమారులు పురుషోత్తంరెడ్డి, చంద్రమోహన్ రెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, అన్నదానం నిర్వహించారు. టీటీడీ, కేశవ మెమోరియల్ పాఠశాల, విజ్ఞాన పీఠం పాఠశాల విద్యార్థులచే ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు, హరికథ, భజన కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల ప్రత్యేక అధికారి కామేశ్వరి, ఆలయ ఈవో గుర్రెడ్డి, తాలూకా సీఐ రామలింగయ్య, జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి అధ్యక్షులు నరసింహారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, క్రిష్టన్న, కోశాధికారి వాసుదేవయ్య పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం జగన్నాథ గట్టుపై శివపార్వతుల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెల్లడించారు.



లలితా పీఠంలో మహా శివుని విగ్రహం



సూర్యాలయంలో శివ పార్వతులకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



ఆది దంపతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేటి కార్యక్రమాలు

● అంబేడ్కర్ భవన్‌లో మ్యూజికల్ నైట్

కర్నూలు కల్చరల్: ఆర్‌ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు వివేకానంద సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో యే షామ్ ఆప్ కే నామ్ పేరుతో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, గాయని రాణి తెలిపారు.

● గోదాగోకులం శోభాయాత్ర

శ్రీ రంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్ సుదర్శన, గరుడ, ఆళ్వారాచార్యుల దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 9 గంటలక శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు పేర్కొన్నారు.

● చనుగొండ్ల, గుడిపాడులో రథోత్సవం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో శ్రీ నాగలింగేశ్వరస్వామి, గుడిపాడులో రామలింగేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నారు.

పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): దేశంలోనే అత్యధిక ప్రజాభిమానం పొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ పదే పదే సైకో అంటే ప్రజలు హైదరాబాద్‌లోని ఇంటి దాకా తరిమి తరిమి కొడతారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ హెచ్చరించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ...పద్నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పని చేశానని, నలభై సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబును ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. తన కుమారుడు లోకేష్ పాదయాత్రకు జనం కరువైన ఫ్రస్టేషన్‌లో బాబు ఏమి మాట్లాడుతున్నాడో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. చిత్తూరు జిల్లాలో పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ కావడంతో జీర్ణించుకోలేక తండ్రి, తనయులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలను ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేనేతలకు అవకాశం కల్పించండి

కర్నూలు(అర్బన్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేనేత వర్గాలకు అవకాశం కల్పించాలని తొగట వీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు గుంపు వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ, పద్మశాలి, కుర్ని, నేసే, స్వకులసాలే, దేవాంగ, కర్ణా, బత్తుల తదితర 18 కులాల చేనేతలందరు కలిసి రాష్ట్రంలో 25 శాతం జనాభాగా ఉన్నామన్నారు. చేనేతలందరు వైఎస్సార్‌సీపీకి ఎల్లప్పుడు అండగా ఉంటున్నారన్నారు. అందువల్ల చేనేతలను రాజకీయంగా అభివృద్ధి చేసే దిశగా మార్చి 9న జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ వర్గానికి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వంకం వెంకటరమణ, కోశాధికారి మాదం గంగాధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రామచంద్రుడు, అసోసియేట్ అధ్యక్షులు ఇట్టె కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంపు వెంకటేశ్వర్లు

మల్లన్న సన్నిధిలో మేయర్

శ్రీశైల మల్లికార్జునుడిని శనివారం వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీగిరిలో జరిగిన మహా శివరాత్రి వేడుకలను వీక్షించారు.

-శ్రీశైలం



ఆటలో 'రవి'కిరణం

- సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్న కొత్తపల్లి వాసి
- జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం

కర్నూలు (టౌన్): ఐదేళ్లుగా పట్టుదలతో ఆడాడు. పతకం కోసం శ్రమించాడు. ఈ ఏడాది అనుకున్నది సాధించాడు.ఏకంగా బంగారు పతకం కైవసం చేసుకున్నాడు ఆత్మకూరు డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలానికి చెందిన రవి. సాఫ్ట్‌బాల్ క్రీడలో తన ప్రతిభతో దూసుకెళ్తూ యువతకు ఆదర్శంగా నిలిస్తున్నారు. మండల కేంద్రం కొత్తపల్లికి చెందిన సుబ్బలక్ష్మీ, రఘురాముడుల కుమారుడు రవి. అతను కొత్తపల్లిలోని సాయి జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి ప్రస్తుతం ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి వృత్తి రీత్యా ప్రైవేటు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు.

సాఫ్ట్‌బాల్ ఆడుతూ...

ప్రధానంగా సాఫ్ట్‌బాల్‌లో హిట్టర్, క్యాచర్ క్రీడాకారులు ఆటలో కీలకంగా వ్యవహరిస్తారు. ఇందులో రవి క్యాచర్‌గా రాణిస్తున్నాడు. 2017లో సాఫ్ట్‌బాల్ క్రీడను ఎంచుకున్న అతను అదే సంవత్సరం గుంటూరు జిల్లా మాచర్లలో జరిగిన సీనియర్ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. ఆ తర్వాత 2018 సంవత్సరంలో శ్రీకాకుళం, 2019లో నెల్లూరు, 2021లో అనంతపురం , 2022లో శ్రీకాకుళం జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. ఐదేళ్లుగా పోరాడుతున్నా పతకం రాలేదు. దీంతో ఈ ఏడాది మరింత శ్రమించాడు. అంతే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో సత్తా చాటి ప్రథమస్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల ఒరిస్సా రాష్ట్రంలో నిర్వహించిన 44వ సీనియర్ నేషనల్ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి అందరి మన్ననలు పొందుతున్నాడు.



జాతీయ పోటీల్లో బంగారు పతకంతో రవి

మరిన్ని పతకాలు సాధిస్తా

జాతీయ స్థాయిలో పతకం సాధించా. సంతృప్తిగా ఉంది. ఇంకా అనేక పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. మరిన్ని పతకాలు సాధిస్తా. పంజాబ్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో చేరి శిక్షణ పూర్తి చేయాలని ఉంది. భవిష్యత్తులో సాఫ్ట్‌బాల్ క్రీడలోనే స్థిరపడతా.

-ఎస్.రవి

గ్రామాల్లోనే రిజిస్ట్రేషన్లు

- ఇప్పటికే 66 గ్రామాల్లో పూర్తయిన భూముల రీసర్వే
- త్వరలోనే ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం

కర్నూలు(సెంట్రల్): జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా జిల్లాలో భూముల రీ సర్వే చురుగ్గా సాగుతోంది. రైతులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న భూ సమస్యలకు రీసర్వేతో చెక్ పెట్టనున్నారు. స్థానికంగా ఉన్న సచివాలయాల్లోనే భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టనున్నారు. ప్రధానంగా గతంలో బ్రిటిష్ వారు కేటాయించిన సర్వే నంబర్ స్థానంలో కొత్తగా ఎల్‌పీఎంను(ల్యాండ్ పార్సిల్ మ్యాపింగ్) కేటాయించారు. దీంతో పాటుప్రత్యేక యూనిక్ ఐడీతో భూ హక్కు కార్డు ఇస్తున్నారు. జిల్లాలో మొదటగా రెండు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా పందిపాడు, కాత్రికిలలో రీసర్వే చేశారు. అక్కడ విజయవంతం కావడంతో రెండో విడతలో 64 గ్రామాల్లో రీసర్వే చేశారు. ప్రస్తుతం మిగిలిన గ్రామాల్లో మూడో విడత రీ సర్వే కొనసాగుతోంది.

పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ

జిల్లాలో ప్రస్తుతం రీసర్వే పూర్తయిన 66 వార్డు/గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ త్వరలో ప్రారంభించే విధంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి కావడంతో భూ హక్కు కార్డులు మంజూరు చేస్తున్నారు. వీటి పంపిణీ పూర్తి కాగానే రిజిస్ట్రేషన్స్ శాఖకు కూడా సర్వే నంబర్ ప్రాంతంలో ఎల్‌పీఎం నంబర్‌ను కేటాయిస్తూ ఆదేశాలు ఇస్తారని, అప్పటినుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఆయా సచివాలయ పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ ఇచ్చారు.



త్వరలోనే రిజిస్ట్రేషన్లు..

జిల్లాలో ప్రస్తుతం కొన్ని పంచాయతీల్లో రీసర్వే పూర్తయింది. పూర్తి చేసిన ప్రాంతాల్లో ఈ నెల చివరికి లేదా మార్చి నెల సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రారంభిస్తాం. ఇప్పటికే స్థానికంగా ఉన్న పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ కూడా ఇచ్చాం.

– సీహెచ్ నాగమల్లేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్, కర్నూలు

పట్టాలెక్కిన ప్రగతి!

- 42వ వార్డులో రూ.1.86 కోట్లతో అభివృద్ధి పనులు
- మౌలిక వసతుల కల్పనకు పాలకవర్గం ప్రాధాన్యత
- రెండేళ్లలోపే ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైన్‌లు, కల్వర్టుల నిర్మాణం

కర్నూలు (టౌన్): పదేళ్ల క్రితం 42వ వార్డు అంటే కనీస సదుపాయాలకు నోచుకొని దుస్థితి. కాలనీలు నగరం నడిబొడ్డున ఉన్నా...ఆనాడు ప్రజా సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో ఐదేళ్ల తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించకపోవడంతోపాటు అభివృద్ధిని గాలికి వదిలేసింది. దీంతో చిన్న పాటి సమస్యలు కూడా పరిష్కారం గాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే 2021 మార్చి నెలలో కర్నూలు నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించడం, అధికార పార్టీ పాలక పగ్గాలు చేపట్టడంతో ప్రగతి పట్టాలెక్కింది. పట్టు మని రెండేళ్లు కూడా పూర్తి కాకముందే రూ.1.86 కోట్లతో వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పాలకవర్గం ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. కాగా కోవిడ్ సమయంలో రెడ్ జోన్‌లో ఉన్న కర్నూలు నగరంలో స్థానికంగా ఉన్న అప్పటి 42వ వార్డు కార్పొరేటర్ కాశిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో ప్రభుత్వం నుంచి బెస్ట్ వారియర్, బెస్ట్ కార్పొరేటర్‌గా అవార్డులు వచ్చాయి.





ఆటోనగర్‌లో సీసీ రోడ్డు నిర్మించిన దృశ్యం, వాణిజ్య నగరంలో రూ.9.95లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్

వార్డు అభివృద్ధికి పాటు పడుతున్నాం



వార్డులో ప్రజల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం. గతంలో ఈ వార్డులో అడుగడుగునా సమస్యలు ఉండేవి. పాలక వర్గం వచ్చిన వచ్చిన తరువాత వార్డులో రూ.లక్షలు వెచ్చించి సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, సీసీ కల్వర్టులు చేపట్టాం . దీంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పాయి. అలాగే రూ.8 లక్షలు వెచ్చించి చల్లావారీ వీధిలో పైపులైన్ పనులు పూర్తి చేశాం. బాబా బృందావన్ నగర్‌లో నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ పార్కును అభివృద్ధిలోకి తీసుకువచ్చాం.

– కాశిరెడ్డి శ్వేత,వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్

వార్డు పరిధిలోని కాలనీలు

బాబా బృందావన్‌నగర్, చల్లావారి వీధి, ఎస్.ఎ. క్యాంపు, జంపాల శివయ్య నగర్, మార్కెట్ యార్డు, రాజీవ్‌నగర్ కాలనీలు ఉన్నాయి. ఆయా కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వివరాలు ఇలా ఉన్నాయి.

- రాజీవ్‌నగర్‌లో రూ.3.5 లక్షలతో సీసీ రోడ్లకు మరమ్మతులు, 4వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.9.60 లక్షలతో సీసీ రోడ్డు, రూ.4.70 లక్షలతో సీసీ ప్యాచ్ పనులు చేపట్టారు.
- విష్ణు టౌన్‌షిప్‌లో రూ. 6.18 లక్షలు వెచ్చించి సీసీ డ్రైన్, కల్వర్టులు నిర్మించారు.
- రూ.6.20 లక్షలతో బాబా బృందావన్‌నగర్ పార్కును అందంగా తీర్చిదిద్దారు. రూ.9.55 లక్షలతో రక్షణగోడ నిర్మాణం
- వక్కెర వాగు వద్ద రూ. 8,50 లక్షలతో సీసీ డ్రైన్, కల్వర్ట్‌ల నిర్మాణం.
- ఆటో నగర్ వద్ద రూ. 9.80 లక్షలతో సీసీ రోడ్డు విస్తరణ, మెయిన్ రోడ్డు నుంచి మసీదు వరకు రూ. 9.90 లక్షలతో సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణం
- బాను ట్రేడర్స్ నుంచి మెహాల్ సెరామిక్స్ అలాగే పాత ఈద్గా వరకు రూ. 9.80 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- వాణిజ్యనగర్ నుంచి ఆటోనగర్ మెయిన్ రోడ్డు వరకు రూ. 9.85 లక్షలతో డబ్ల్యూబీఎం రోడ్డు ఏర్పాటు.
- బళ్లారి రోడ్డు నుంచి హనుమాన్ కాట వరకు రూ.9.90 లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణం
- ఎస్‌ఏపీ క్యాంపు వెనుక వైపు నుంచి యూకాన్ షాపీ వరకు రూ. 9.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- బళ్లారి చౌరస్తా నుంచి చల్లావారి వీధి వరకు రూ.9.99 లక్షలతో పైపులైన్ నిర్మాణాలు పూర్తి చేశారు.
- వాణిజ్య నగర్‌లో రూ.9.99 లక్షలతో సీసీ డ్రైన్, కల్వర్టుల నిర్మాణం.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు: కల్లూరులోని శ్రీనివాస నగర్ వద్ద ఈ నెల 13వ తేదీ రాత్రి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమారుడు శివనరసింహారెడ్డికి పీఏ కొమ్ము గిరిప్రసాద్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను నాల్గవ పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. శరీన్‌నగర్‌కు చెందిన ఎరుకలి నల్లబోతుల వంశీ అలియాస్ వంశీకృష్ణ, కల్లూరులోని సుంకులమ్మ గుడి దగ్గర ఉన్న శీలపోగు విశ్వనాథ్ అలియాస్ బన్నీ, సి.క్యాంప్‌లోని సత్యనారాయణ నగర్‌లో నివాసముంటున్న ఎరుకలి శివ అలియాస్ శివలు కలసి గిరిప్రసాద్‌పై శ్రీనివాసనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద కత్తితో దాడి చేసి పరారయ్యారు. సెక్షన్ 307 రెడ్‌విత్ 340 ఐపీసీ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్‌ఐ రామయ్య ఆధ్వర్యంలో శనివారం ఉదయం కల్లూరు మండలం ఉల్చాల రోడ్డు సమీపంలోని ఎల్కూరు ఎస్టేట్ వద్ద ముద్దాయిలను దాడిచేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఏపీ21 సీఎఫ్ 2999 రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్, రక్తం మరకలు కలిగిన దుస్తులు, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



హత్యాయత్నం కేసులో నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

సంతాపం..

కర్నూలు(సెంట్రల్): ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు వైవీ రావు గుండెపోటుతో మృతి చెందడంపై సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శనివారం ఓ ప్రకటనలో సంతాపాన్ని తెలిపారు.